క్లుప్తంగా

కులం పేరుతో భర్త దూరం పెడుతున్నాడని ధర్నా..


తరిగొప్పుల: తనతో రెండు నెలలుగా సహ జీవనం చేసి, మన కులాలు వేరు, నీతో ఇకపై కాపురం చేయనంటూ తన భర్త మోసం చేశాడంటూ ఓ వివాహిత ధర్నా చేసిన సంఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. మండలంలోని అంకుషాపురం గ్రామానికి చెందిన కర్ణకంటి హేమలత(27)కు గతంలో దామెరకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. మనస్పర్థల కారణంగా రెండేళ్లుగా భర్త నుంచి దూరంగా తల్లిగారింటిలో ఉంటుంది. ఇదిలా ఉండగా అంకుషాపూర్ శివారు బంజరుపల్లికి చెందిన గుండెకారి రాజలింగంకు వివాహమై భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో హేమలతకు దగ్గరై రెండు నెలల క్రితం దండలు మార్చుకుని కాపురం చేస్తున్నాడు. ఇటీవల మన కులాలు వేరు నీతో కాపురం చేయలేను అంటూ దూరం పెడుతున్నాడని తెలిపింది. చేసేదేమి లేక ఐదు రోజుల క్రితం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు ఫిర్యాదును స్వీకరించకపోవడంతో గత గురువారం మండలకేంద్రంలోని గొల్లకుంటలో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించగా సమాచారం అందుకున్న పోలీసులు అడ్డుకుని భర్త రాజలింగంను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అయినప్పటికీ తన భర్తలో మార్పు రాకపోవడంతో పాటు అదేరోజు రాత్రి తనను కొట్టడంతో శుక్రవారం తిరిగి హేమలత పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. గత రెండురోజులుగా పోలీసులు స్పందించకపోవడంతో శనివారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసింది. స మాచారం అందుకున్న ఎస్సై శ్వేత సంఘటన స్థలానికి చేరుకొని బాధిత మహిళకు న్యాయం చేస్తామని ధర్నాను విరమింపజేశారు. అనంతరం జనగామలోని సఖి కేంద్రానికి తరలించారు. ఈ విషయమై ఎస్సై శ్వేతను వివరణ కోరగా సదరు మహిళా ఫిర్యాదు స్వీకరించి విచారణ చేస్తున్నప్పటికీ కావాలనే హేమలత రాద్ధాంతం చేస్తుందని తెలిపారు.

చెట్లు ప్రగతికి మెట్లు

బచ్చన్నపేట : చెట్లు ప్రగతికి మెట్లు అని మండలంలోని బిషప్ తుమ్మబాల పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెంట్ ఫాదర్ బాల అన్నారు. శనివారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

భక్తుల ఇలవేల్పు లక్ష్మీనర్సింహస్వామి

- రేపటి నుంచి జాతర ప్రారంభం
- నెల రోజులు సాగనున్న జాతర ఉత్సవాలు
- వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక


కొండపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలోని పడమరకొండపై వెలసిన వేల్పుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర మహోత్సవాలు శ్రావణమాసంలో ఈ నెల 5 నుంచి ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు జరిగే జాతర మహోత్సవానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఇప్పటికే ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేల్పుగొండ కొండపై రాతిని చీల్చుకొని శ్రీలక్ష్మీనర్సింహస్వామి సతిసమేతంగా వెలిశారు. ఎన్నో ఏళ్ల నుంచి స్వామివారిని భక్తుల పాలిట ఇలవేల్పుగా కొలుస్తున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలిరానున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా స్వామి వారు దీవెనలు ఇస్తారని ఇక్కడి భక్తుల నమ్మకం. ఎత్తైన కొండపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకోవాలంటే భక్తులు కొండపైకి కాలినడకనే వెళ్లాల్సి ఉంటుంది. ఈ కొండపై రెండు కోనేరులు ఉన్నాయి. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ కోనేరులు ఒకటి స్వామి వారి ఆలయం ముందు ఉండగా మరొకటి దీనికి కొద్ది దూరంలో ఉంది. నిత్యం నీరుతో నిండుగా కన్పించే ఈ కోనేరులు స్వామివారి మహిమగా భక్తులు చెప్పుకుంటారు. సోమ, శని వారాల్లోనే ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పిస్తారు. కొండపైన స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఇదేకొండ దిగువ భాగాన ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని కూడ భక్తులు దర్శించుకుంటారు. ఈ జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పొడిశెట్టి వెంకటాచార్యులు తెలిపారు.

మాట నిలబెట్టుకునేందుకు సీఎం కృషి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం : రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఇప్పటికే రూ.లక్ష, రూ.లక్షన్నర రుణాలమాఫీ అయిందని, ఈ నెలాఖరు వరకు రూ.2 లక్షల రుణమాఫీ తప్పకుండా అవుతుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో రూ.10.88 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను మండలంలోని 33 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేటకు వచ్చే కాల్వ లైనింగ్ పనులకు రూ.160 కోట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలో విడుదల అవుతాయని అన్నారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయంలో ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీఓ కొంరయ్య, తహసీల్దార్ వినయలత, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్, మల్లారెడ్డి, బాబు, నాగేందర్, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చిల్పూరు: మండలంలోని వెంకటాద్రిపేటకు చెందిన నోముల రమేశ్ 10 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట చిల్పూరు ఆలయ శాశ్వత దాత శ్రీధర్‌రావు, మాజీ ఎంపీటీసీ కుమార్, తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రఘునాథపల్లి: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ప్రాణవాయువు అందించే మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని వెల్ది మోడల్ స్కూల్‌లో ఆయన అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రిన్సిపాల్ వాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటి వాటిని అడాప్ట్ చేసుకొని సంరక్షించాలని సూచించారు. విరివిగా మొక్కలు నాటించి పచ్చదనం పెంచడంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ తన మార్క్ చూపించాలని కోరారు. డీఆర్డీఓ మొగులప్ప, ఆర్డీఓ కొమురయ్య, ఏసీపీ భీంశర్మ, ఎఫ్‌ఆర్‌ఓలు కొండల్‌రెడ్డి, మురళి, డీఈఓ రాము, డీసీఓ రాజేందర్‌రెడ్డి, అదనపు డీఆర్డీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ యుగేందర్, పార్థసారథి పాల్గొన్నారు.

గ్రామాల్లో 'స్వచ్ఛదనం - పచ్చదనం' నిర్వహించాలి

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో పలువురు అధికారుల అవగాహన సమావేశం నిర్వహించారు. అలాగే వీఎస్‌ఆర్ నగర్‌లో ఎంపీడీఓ మల్లికార్జున్ సమావేశాన్ని నిర్వహించారు. ఇంటింటా మొక్కలను నాటుతూ ఊరంతా పచ్చదనంతో ఉట్టి పడేలా చేయాలన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే ఆణిముత్యాలు

దేవరుప్పుల : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఆణిముత్యాలుగా తయారవుతారని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఈదునూరి నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన వర్ధమాను మైత్రికి మర్రి అరవింద్ ఫౌండేషన్ సహకారంతో రూ.10 వేలతోపాటు ప్రశంసాపత్రాన్ని లయన్స్ ప్రతినిధులు అందజేశారు. హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ పట్టాభిరామిరెడ్డి, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజావాణి

నర్మెట: తహసీల్‌లో సోమవారం నుంచి ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రజలు భూ సమస్యలను లిఖితపూర్వకంగా ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


కొడకండ్ల: హక్యతండ స్కూల్‌లో టాయిలెట్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న యశస్వినిరెడ్డి

కొడకండ్ల/దేవరుప్పుల/పాలకుర్తి/పాలకుర్తిటౌన్ : పేదల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి మండలాల్లోని మొండ్రాయి, కొడకండ్ల, హ క్యతండ, ఏడునూతుల నీర్మాల, సీతారాంపురం, కామారెడ్డిగూడెం, దేవరుప్పుల, పాలకుర్తి, వావిలాల, కొండాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, వివిధ గ్రామాలకు చెం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. నియోజకవర్గానికి రూ.10 కోట్లు నిధులు మంజూరయ్యాని తెలిపారు. పాలకుర్తి మండలానికి రూ.2 కోట్ల నిధులను మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమాల్లో మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ సురేష్‌నాయక్, రాపాక సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్ యూఐ నియోజకవర్గ అధ్యక్షులు రాజేష్‌నాయక్, హరగోపాల్‌గౌడ్, శ్రీరాములు, ధర్మారెడ్డి, పాండు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎ స్సీ, ఎస్టీ, బీసీ సెల్ మండల అధ్యక్షులు నాగరాజు, హను మాండ్ల తిరుపతిరెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

పరామర్శ

గూడ జయలక్ష్మీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పాలకుర్తిలో సీనియర్ జర్నలిస్టు మార్గం లక్ష్మీనారాయణ తల్లి మంగమ్మ ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పరామర్శించారు.

నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం

ఆత్మీయ మిత్రుడు


మిత్రుడు అమృత్‌సబావత్‌తో కలెక్టర్

జనగామ: హైదరాబాద్‌కు చెందిన ఎస్.అమృత్ సబావత్‌తో 2014 సంవత్సరం సివిల్ సర్వీసెస్ ప్రిపరేషన్ సమయాన ఢిల్లీలో ఏర్పడిన స్నేహం దశాబ్ద కాలంగా కొనసాగుతోంది. మూడేళ్ల పాటు ఒకేరూంలో ఉంటూ సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమయ్యాం. మెయిన్స్ కోసం పోటీపడి చదువుకున్నాం. నాకు ఏ డౌట్ వచ్చినా స్నేహితున్ని అడిగి ముందుకు వెళ్లాను. ప్రిపరేషన్ కోసం సబ్జెక్టుల మెటీరియల్ సేకరిస్తూ నా ఉన్నతికి దోహదపడిన ఆత్మీయ మిత్రుడు. పరీక్షల్లో ఇద్దరికి ఉత్తమ ర్యాంకులు వచ్చినా.. మిత్రుడికి ఇంటర్వ్యూలో మార్కులు తక్కువగా రావడంతో ఐఏఎస్‌కు అర్హత సాధించ లేకపోయాడు. అయినా బెంగ పడలేదు. నాకు అవకాశం వచ్చిందని ఎంతో సంబరపడ్డాడు. వెన్నుతట్టి ప్రోత్సహించాడు. కోచింగ్ సమయంలో ఓ వైపు ప్రిపరేషన్ అవుతూనే రోజూ మిత్రుడే వంట చేసేవాడు. ప్ర స్తుతం హైదరాబాద్‌లో బిజినెస్ చేస్తూ రాణిస్తున్నాడు. ఇప్పటికీ మా స్నేహం చెక్కుచెదరకుండా ఉంది. పొర పచ్చాలను సీరియస్‌గా తీసుకోకుండా కష్ట సుఖాల్లో పాలుపంచుకునేదే నిజమైన స్నేహం.

– షేక్ రిజ్వాన్ బాషా, కలెక్టర్, జనగామ

అన్నీ తానై ప్రోత్సహించాడు..


స్నేహితుడు దినేష్‌గంటితో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ: ఉస్మానియా యూనివర్సిటీలో 2004 సంవత్సరం ఇంజనీరింగ్ చేస్తున్న సమయంలో దినేష్ గంటి పరిచయమయ్యారు. రెండు దశాబ్దాల స్నేహంలో పోటీ పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలి.. రోజుకు ఎన్ని గంటలు చదువుకోవాలి.. మెటీరియల్ ఎక్కడ దొరుకుతుంది.. ఈ విషయాల్లో అన్నీ తానై అందించిన ప్రోత్సాహం మరిచిపోలేనిది. ఇద్దరం కలిసి కష్టపడి చదువుకున్నాం. నేను అదనపు కలెక్టర్ హోదాలో ప్రభుత్వ ఉద్యోగంలోకి రాగా.. స్నేహితుడు సనాతన ధర్మం, ఆధ్యాత్మికత వైపు వెళ్లాడు. హైదరాబాద్‌లో కరిష్యే పేరిట భక్తికి సంబంధించి వ్యాపార రంగంలో అడుగుపెట్టి తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. నా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని స్నేహితుడు. ప్రతిఒక్కరికి ఇలాంటి మిత్రుడు ఉండాలి.

– బి.రోహిత్‌సింగ్, అదనపు కలెక్టర్, జనగామ

స్నేహితుడే ఓదార్పు..


మిత్రుడు రాంచందర్‌తో డీసీపీ

జనగామ: జీవితంలో కష్టమైనా.. సంతోషమైనా ఒక్క స్నేహితుడితోనే షేర్ చేసుకుంటాం. నా జీవితంలో అలాంటి మిత్రుడు.. సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ రాంచందర్. 1999 సంవత్సరం ఎంసీఏ కౌన్సెలింగ్ సమయాన ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. రెండున్నర దశాబ్దాలుగా కొనసాగుతోంది. మేమిద్దం ఒక కుటుంబ సభ్యుల్లా ఉంటాం. మనం సాగించే ప్రయాణంలో ఒక్క స్నేహితుడిని కరెక్టుగా పట్టుకోగలిగితే.. ఎంతటి కష్టాన్నైనా తట్టుకోగలుగుతాము. ఇంట్లో చెప్పుకోలేని సమస్యలను మిత్రుడితో షేర్‌చేసుకోవడం వల్ల..రిలాక్సేషన్, ఓదార్పు దొరుకుతుంది.

– రాజమహేంద్రనాయక్, వెస్ట్‌జోన్ డీసీపీ

విద్యుత్‌షాక్ బాధితుడితో ధర్నా


ధర్నా చేస్తున్న గంగు బంధువులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఇటీవల వ్యవసాయ బావి వద్ద విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన బానోతు గంగును స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో ఏడీఈ కార్యాలయం ఎదుట వేసి బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ధర్నా చేపట్టారు. విద్యుత్‌శాఖ అధికారులు తమకు చేసిన హామీ మేరకు బాధితుడి ఆస్పత్రి ఖర్చులు, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. అనంతరం బాధితుడి భార్య నీరజ, బంధువులు గుగులోతు బాలు, జయపాల్ మాట్లాడారు. మండలంలోని జిట్టెగూడెం తండా శివారు నారాయణలొద్ది తండాలో వ్యవసాయ పనుల నిమిత్తం జూలై 19న తనపొలం వద్దకు వెళ్తున్న గంగుకు ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైరు తలపై తాకడంతో విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. ప్రమాదం జరిగిన మరుసటి రోజు విద్యుత్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే విద్యుత్‌శాఖ నుంచి కొందరు తమతో రాజీ కోసం మాట్లాడారని, తాటికొండ లైన్‌మన్ సురేందర్‌రెడ్డి, ఫత్తేపూర్ ఎల్‌ఐ క్రాంతి తదితరులు కలిసి మొత్తం రూ.4.50 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు కాగితం రాసుకున్నామన్నారు. ఇంతవరకూ ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఈ విషయమై సత్వరమే న్యాయం చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. గాయాలతో ఉన్న వ్యక్తితో ధర్నా చేయడం ఘన్‌పూర్‌లో చర్చనీయాంశంగా మారింది. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ ఏడీఈ వంశీకృష్ణ, ఏఈ చంద్రమోహన్ అక్కడకు చేరుకుని బాధితుడి కుటుంబ సభ్యులతో మాటాడి హామీ చేయడంతో వారు ఆందోళన విరమించారు.

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ బడిలో చేర్పించాలి

చిల్పూరు: ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను సర్కారు స్కూల్‌లో చేర్పించాలని తహసీల్దార్ సరస్వతీ అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న తహసీల్దార్ సరస్వతీ-మాధవరావు కుమారుడు శ్రీవర్ధన్ జన్మదినం సందర్భంగా పిల్లలకు, ఉపాధ్యాయుల సమక్షంలో ఉదయం కేక్ కట్ చేయగా, మధ్యాహ్న భోజనంలో ప్రత్యేక వంటకాలు అందజేశారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి

బచ్చన్నపేట : ప్రజలు తపాలా సేవలను వినియోగించుకోవాలని జనగామ వెస్ట్ సబ్‌డివిజన్ ఏఎస్పీ మద న్‌మోహన్ అన్నారు. శనివారం చిన్నరామన్‌చర్లలో నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

బచ్చన్నపేట : సాల్వాపూర్, మన్‌సాన్‌పల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ యువనాయకులు పోచంపల్లి నాగరాజు, అఖిల్ మాల, శ్రీకాంత్ అన్నారు. స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే గ్రామాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే పునరుద్ధరించాలని డిపోమేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

పేదలకు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భరోసా కల్పిస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం ఇటుకాలపల్లిలో కొలుగూరి రామచంద్రయ్య వైద్యానికి రూ.58,500 ఎల్‌ఓసీని అందించారు.

గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలి

కొడకండ్ల : 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని గ్రామాన్ని ఆదర్శంగా నిలుపాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి, స్పెషలాఫీసర్ రవీందర్ కోరారు. శనివారం జీపీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

బచ్చన్నపేట : పోచన్నపేటలో నిరుపేద కుటుంబం నర్సింగ గౌరమ్మకు ఆ గ్రామ సామాజిక సేవా కర్త పోతుల రాములుయాదవ్ ఆర్థికసాయాన్ని శనివారం అందించారు. 25 కిలోల బియ్యంతో పాటు రూ. 500 అందించారు.

పేరు మార్పు విరమించుకోవాలి

జనగామ రూరల్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మహంకాళి హరిశ్చంద్ర గుప్త అన్నారు. సీఎం ఆలోచనకు నిరసనగా శనివారం గాంధీవిగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి టౌన్: విద్యార్థుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలకు పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ విద్యార్థులను తరలించే బస్సులకు క్లీనర్లను నియమించుకోవాలన్నారు. డ్రైవర్ ఆరోగ్యాలను పరీక్షించుకోవాలన్నారు.

నష్టపరిహారం అందించాలి

జనగామ రూరల్ : గౌతమ్ మోడల్ స్కూల్ బస్సు కిందపడి మృతి చెందిన విద్యార్థి బానోత్ వరుణ్ తేజ కుటుంబాన్ని ఆదుకోవాలని శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు, ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ, టీజీవీపీ,టీఆర్‌ఎస్‌వీ, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. కుటుంబ సభ్యులకు రూ.20 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులతో పోలీసులు చర్చించారు. ఆర్థికంగా ఆదుకుంటామని పాఠశాల యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాలుడు తరుణ్‌తేజ పాఠశాల యాజమన్యాల నిర్లక్ష్య కారణంగా మృతి చెందడం బాధాకరమని ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కిరణ్ అన్నారు. శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని అన్నారు.

శ్రీనివాసాశర్మ సేవలు చిరస్మరణీయం

దేవరుప్పుల : ఆధ్యాత్మిక చింతనతోపాటు ఉన్నత విద్యావంతుల కోసం తోడ్పాటు అందించిన శ్రీనివాసాశర్మ సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషమ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దమడూరులో గుండెపోటుతో మృతిచెందిన శ్రీనివాసాశర్మ మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ప్రీతమ్‌ను ఘన్‌పూర్‌కు చెందిన పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సింగపురం రాజయ్య శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉచిత వైద్యశిబిరం

రఘునాథపల్లి : స్థానిక గ్రామ పంచాయతీ వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత డయాబెటీస్ వైద్యశిబిరం నిర్వహించారు. లయన్ సభ్యుడు రాజేందర్‌గుప్తా పుట్టినరోజును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని లయన్ జోన్ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్ ప్రారంభించారు. వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యాన అధికారి

జనగామ రూరల్: జిల్లా ఉద్యానవన పట్టుపరిశ్రమల అధికారిగా నియమితులైన బి.శ్రీధర్ శనివారం కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగును క్షేత్రస్థాయిలో విస్తృత పరిచేలా కృషి చేయాలని సూచించారు.

గోదావరి జలాలతో చెరువులు నింపాలి

బచ్చన్నపేట : ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తూ జలాలు వృథాగా పోతున్నాయని, ఆ నీటితో ఈ ప్రాంత చెరువులు, కుంటలను నింపాలని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానికంగా మాట్లాడారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

జనగామ : జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వ్యాపారి నుంచి రూ.30వేలు చోరీ చేసిన ఘటన శనివారం జరిగింది. బాణాపురం గ్రామానికి చెందిన బిట్ల ఉపేందర్ హైదరాబాద్ వెళ్లేందుకు తన ద్విచక్రవాహనంపై బస్టాండ్‌కు వచ్చాడు. బైక్ పార్కింగ్ చేసిన తర్వాత 3, 6 ఫ్లాట్ ఫాం సమీపంలో కొద్ది సేపు కూర్చునున్నాడు. బస్సు ఫ్లాట్‌ఫాంపైకి రాగానే లోపలకు వెళ్లే సరికి జేబులో ఉన్న రూ.30 వేలు లేకపోవడంతో స్టేషన్‌లో వెళ్లి ఫిర్యాదు చేశాడు.

సూరారంలో బీజేపీ నేతలు

జఫర్‌గఢ్: సూరారం గ్రామాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు నాగేష్‌గౌడ్ నేతృత్వంలో పార్టీ నాయకులు శనివారం సందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాని అధికారులను డిమాండ్ చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

జఫర్‌గఢ్: కూర విషయంలో భార్యాభర్తల మధ్య జరిగిన చిన్న గొడవ కారణంగా క్షణికావేశానికి గురైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హిమ్మత్‌నగర్ శివారు గువ్వలగూడెంలో శనివారం జరిగింది. ఎస్సై బానోత్ రామ్‌చరణ్ కథనం ప్రకారం.. నీరటి దేవేందర్ (28) భోజనం చేస్తుండగా కూర విషయంలో భార్యతో గొడవపడ్డాడు. దీంతో మధ్యాహ్నం ఇంటి గదిలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చుట్టుపక్కల వారికి తెలపడంతో పాటు వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే దేవేందర్ స్పృహతప్పి పడిపోయాడు. చికిత్స నిమిత్తం జఫర్‌గఢ్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, 5 నెలల కుమారుడు ఉన్నారు.

బీజేపీ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శిగా రాజు

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన ద్యావర రాజు బీజేపీ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. శనివారం ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డిలు మండల కేంద్రంలో రాజుకు నియామక పత్రం అందజేశారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా అజయ్

దేవరుప్పుల : ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీతారాంపురం గ్రామానికి చెందిన గుంటి అజయ్‌ని నియమించినట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నే శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

ఉపాధ్యక్షుడిగా రాజు

జఫర్‌గఢ్ : మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన నేరెళ్ల రాజును బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అరుట్ల దశమంత్‌రెడ్డి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే మండలానికి చెందిన చల్ల వినయ్‌కుమార్ యాదవ్‌ను పార్టీ జిల్లా కార్యదర్శిగా సాగరం గ్రామానికి చెందిన యువరాజ్ యాదవ్‌ను పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



నర్మెట/తరిగొప్పుల/చిల్పూరు/జఫర్‌గఢ్/స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి/బచ్చన్నపేట/కొండకండ్ల/దేవరుప్పుల : తల్లిపాలే బిడ్డకు అత్యంత శ్రేష్టమని పలువురు వక్తలు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం శిశువులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆకుకూరలు, పప్పుధాన్యాలు, ఆహారంగా అందించాలన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే'

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు పలు హామీలు చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి వ్యక్తిగత కుటుంబ స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ అన్నారు. ఘన్‌పూర్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. నియోకజకవర్గంలో అధికార పార్టీలు, ఎమ్మెల్యేలు మారుతున్నారే గాని అభివృద్ధిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడం ఖాయమన్నారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, యుగేందర్‌రెడ్డి, వెంకటరమణ, పాల్గొన్నారు.

న్యాయం కోసం డీసీపీని కలిసిన వృద్ధ దంపతులు


డీసీపీని వేడుకుంటున్న వృద్ధ దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్: తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరుతూ ఘన్‌పూర్‌కు చెందిన వృద్ధ దంపతులు గట్టు శ్రీహరి, కొమురమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ రాజమహేంద్రనాయక్‌ను శనివారం వేడుకున్నారు. ఘన్‌పూర్‌కు చెందిన శ్రీహరి తన తమ్ముడి కుమారుడైన వినయ్‌కు రూ.1లక్ష అప్పుగా ఇచ్చాడు. సదరు డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నాడని, ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆశ్రయించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి డీసీపీ హాజరు కాగా ఆ సమయంలో సదరు వృద్ధ దంపతులు తమ గోడును చెప్పుకున్నారు. డీసీపీకి వారు రెండు చేతులు నమస్కరిస్తూ తమ సమస్యను చెప్పే క్రమంలో కాళ్లు మొక్కే ప్రయత్నం చేయగా డీసీపీతో పాటు అక్కడ ఉన్న పోలీసులు వారించారు. తక్షణమే స్పందించిన డీసీపీ అక్కడ ఉన్న సీఐ ముస్క రాజు, ఎస్సై వినయ్‌కుమార్‌ను ఈ కేసును చూసి పరిష్కరించాలని ఆదేశించారు.

స్థానిక పోరులో సత్తా చూపాలి


మాట్లాడుతున్న దశమంత్‌రెడ్డి

రఘునాథపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఏఎస్‌ఆర్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీకి ఎనిమిది ఎంపీ స్థానాలు కట్టబెట్టారని, రానున్న రోజులు బీజేపీవే అని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ కావటి ముత్యాలు, ఊడ్గుల రమేష్, బనుక శివరాజ్, వల్లాల ఉపేందర్, వెంకటేశంయాదవ్, వెంకటేష్, నర్సింహారెడ్డి, దైతల రంజిత్, తిరుమల్‌ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
కె. రాజశేఖర్ (S.R) : 9640341435 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191